ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

● డయల్ యువర్ కమిషనర్ రద్దు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. వినాయక నిమజ్జన కార్యక్రమంలో అధికారులుంటారని, కావున డయల్ యువర్ కమిషనర్ రద్దు చేశామని తెలిపారు.

మహిళా పార్లమెంటేరియన్లకు తిరుపతి వేదిక

● 14,15 తేదీల్లో సమావేశాలు

ప్రజాశక్తి -తిరుపతి బ్యూరో: మహిళా పార్లమెంటేరియన్లకు తిరుపతి ఆహ్వానం పలకనుంది. 14,15 తేదీల్లో దేశవ్యాప్తంగా ఉన్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే మహిళలకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు తిరుపతిలో పది రోజుల క్రితం అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురాం రాజులు స్థల పరిశీలన చేశారు. తిరుపతి, తారకరామ స్టేడియం వేదిక కానున్నట్లు సమాచారం. 14వ తేదీ జరిగే సమావేశానికి పార్లమెంటు స్పీకర్ ఓమ్ బిర్లా, సీఎం చంద్రబాబులు హాజరుకానున్నారు. ఆఖరి రోజు 15వ తేదీ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరై ప్రసంగిస్తారు. తొలిరోజు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ విధానంలో మహిళా ప్రజాప్రతిదుల ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ సమావేశాల విజయవంతానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సోమవారం నుంచి వేదిక ఏర్పాట్లు, మహిళ ప్రజాప్రతినిధులకు వసతి సౌకర్యాలపై చర్చించుకున్నారు. తిరుపతిలో ప్రైవేటు హోటల్స్ అన్ని బుక్ చేసుకునే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. అలాగే మహిళా ప్రజా ప్రతినిధులకు శ్రీవారి దర్శనం ఏర్పాట్లు కూడా టిటిడి పాలకమండలి చైర్మన్ బిఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరిలతో కలిసి మాట్లాడనున్నారు.

టిడిఆర్ బాండ్ల కుంభకోణంపై దర్యాప్తు చేయాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతిలో గత వైసీపీ ప్రభుత్వ హాయంలో టిడిఆర్ బాండ్ల కుంభకోణం జరిగిందని, అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న భూమన కరుణాకర్ రెడ్డి ఎటువంటి విచారణకైనా సిద్ధమని ప్రకటించిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం వెంటనే విచారణ జరిపితే దీని వెనుక ఉన్న వారు, ఈ కుంభకోణం వలన వేల కోట్ల రూపాయలు ఎవరెవరికి చేరిందన్న విషయాలు బయటకు వస్తాయని మాజీ ఉమ్మడి రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ గోనె ప్రకాష్ రావు సూచించారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతిలో జరిగిన టిడిఆర్ బాండ్ల కుంభకోణంతో వచ్చిన నగదును తణుకు, గుంటూరు, వైజాగ్ ప్రాంతాల్లో అభ్యర్థులుగా పోటీ చేసిన వారికి, వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డికి ముడుపులు వెళ్లాయని తనకు తెలిసిన సమాచారమన్నారు. ఎన్నికల సమయంలో తిరుపతిలో జరిగిన టిడిఆర్ బాండ్ల కుంభకోణంపై అధికారంలోకి వచ్చిన వెంటనే దర్యాప్తు చేయిస్తామన్న వారు నేడు ఎందుకు నిమ్మకుండిపోయారన్నారని ప్రశ్నించారు. ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మీ వ్యవహారంలో మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి చేసిన విమర్శలపై ప్రభుత్వం స్పందించాలన్నారు. శ్రీలక్ష్మిని తిట్టిన భూమనే వైసిపి హాయంలో పోస్టింగు ఇవ్వడంలో సహకరించారని, నేడు దూషించడం పట్ల ప్రజలకు ఉన్న అనుమానాలు నివృత్తి కావాలంటే దర్యాప్తు చేస్తే ఎవరెవరి అవినీతి ఎంత అనేది బయటకు వస్తుందన్నారు. ఉపరాష్ట్రపతి కూటమి అభ్యర్థికి సంఖ్యా బలం లేదని, జగన్మోహన్ రెడ్డి, రాహుల్ గాంధీ ఆంధ్రప్రదేశ్లో ఈవీఎంల ద్వారా మోసం జరిగిందని ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నిస్తున్నారని, ఇదంతా కేవలం తన కేసులను కప్పిపుచ్చుకోవడానికి బిజెపితో కలిసి ఆడుతున్న నాటకమన్నారు. బిజెపిని విమర్శించే దమ్ము జగన్ మోహన్ రెడ్డికి లేదని, ఉపరాష్ట్రపతి కూటమి అభ్యర్థికి సంఖ్యాబలం లేనందున ఇండియా కూటమి అభ్యర్థికి జగన్ మద్దతు ఇవ్వకుండా బొత్స సత్యనారాయణ ద్వారా కూటమి అభ్యర్థికి మద్దతు ప్రకటించడం చూస్తుంటే బిజెపిని ఎదురిస్తే తనకు జైలు శిక్ష ఖాయమని జగన్ అభిప్రాయానికి వచ్చారన్నారు. ప్రజా ప్రయోజనాలు, ప్రజాధనం కాపాడడంలో కూటమి ప్రభుత్వం భూమన ఛాలెంజ్‌పై స్పందించి దర్యాప్తుకు ఆదేశించాలని కోరారు.

సిఐటియు మండల మహాసభ

సిఐటియు జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - నాయుడుపేట: తిరుపతి జిల్లా నాయుడుపేటలోని, వేదనపర్తి సుందర రామిరెడ్డి భవన్ సిఐటియు కార్యాలయం వద్ద ఆదివారం సిఐటియు మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీ సిఐటియు జెండాను ఎగురవేశారు. ఈ మహాసభలో 21 మంది సభ్యులతో నూతన కమిటీ ఏర్పాటు చేశారు. మండల కమిటీ అధ్యక్షులుగా సంఘం మహేష్ బాబు, కార్యదర్శిగా శివకవి ముకుంద, సహాయ కార్యదర్శి ఎన్.శ్యామలమ్మ, సహ అధ్యక్షులుగా సుజాత, ఎస్ కె కాలేషా, ట్రెజరర్‌గా కె.విజయమ్మ, కమిటీ సభ్యులుగా ఎస్‌కె అబ్దుల్లా, మస్తాన్ రెడ్డి, సతీష్, పెంచలమ్మ, వాణెమ్మ, లక్ష్మి, నాగమణి మొత్తం 21 మందితో నూతన కమిటీ ఎంపిక చేశారు. సభలో వక్తలు మాట్లాడుతూ మున్సిపాలిటీ, ఆర్టీసీ స్వీపర్లు ఇలా అనేక రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు చట్ట ప్రకారం రావలసిన రాయితీలు రావటం లేదన్నారు. కనీస వేతనం ఇవ్వకుండా కొద్దిపాటి జీతం ఇస్తూ ఆ జీతం కూడా నెలల తరబడి బకాయిలు పెడుతున్నా రన్నారు. జీతాలు అడిగిన వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ పనిలో నుండి తొలగించేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి జీతాల బకాయిలు వెంటనే చెలించాలని, ముఠావర్కర్స్‌కి, భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో, వ్యాన్, టాక్సీ డ్రైవర్లు, రూటు టాక్సీలు అనేక రకాల టాక్సీలు నడుపుతున్న వారికి బండి నిలుపుకోవడానికి కూడా స్టాండ్లు లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. యూఇఇయూ డివిజన్ అధ్యక్షులు జ్యోతిబసు మాట్లాడుతూ పనిచేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టర్ లేబర్‌ను పర్మినెంట్ చేయాలని, జూనియర్ లైన్మెన్ గ్రేడు వారిని పర్మినెంట్ చేయ్యాలని కోరారు. కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడి, ఆశ, మధ్యాహ్నం భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత, పనికి తగ్గ వేతనం కల్పించాలని కోరారు. అనేక ఫోన్ యాప్‌లు, రాజకీయ వేధింపులు అరికట్టాలని కోరారు. సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాణమ్మ, శంకర్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ తిరుపతి..!

- తూర్పు వైపు విస్తరణకు ఎక్కువ అవకాశాలు
- పాలకమండలి గడువు ముగిసిన తర్వాత ప్రక్రియ వేగవంతం
- మేధావుల, నాయకుల, ప్రజల అభిప్రాయ సేకరణ అవశ్యం
- జనాభా ప్రాతిపదికన గ్రేటర్‌కు పరిసర గ్రామాల మదింపు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి పట్టణం గ్రేటర్ తిరుపతిగా మారే దిశగా దూసుకెళుతోంది. ఇప్పటివరకు కార్పొరేషన్‌గా ఉన్న తిరుపతికి గ్రేటర్ స్థాయి చేకూర్చాలని రాష్ట్ర ప్రభుత్వం సంకేతాలు జారీ చేసినట్లు సమాచారం. తిరుపతికి ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా నగరాన్ని మరింత విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. తిరుమలకు రోజుకు లక్షమందికి పైగా యాత్రికులు రాకపోకలు సాగిస్తున్నారు. వీఐపీల తాకిడి రోజురోజుకు పెరుగుతోంది. తిరుపతి చుట్టుపక్కల అనేక పరిశ్రమలు కొత్తగా వస్తున్నాయి. తిరుపతి నగరం ఇటు ఆధ్యాత్మికతతోపాటు, అటు పర్యాటక రంగంగా అభివృద్ధి చెందుతోంది. ఇక్కడ వసతులు మరింత మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తిరుపతి నగరాన్ని గ్రేటర్ చేయాల్సిన అవసరం ఉందని భావిస్తోంది. తిరుపతి కార్పొరేషన్ కేవలం 36 కిలోమీటర్ల పరిధి లోపల ఉండడంతో, మరింత విస్తరించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని కమిషనర్ మౌర్య, రాష్ట్ర మున్సిపల్ పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి నారాయణలు ప్రభుత్వానికి సూచిచారు. తిరుపతి నగరానికి రెండు ఐకానిక్ భవనాలు నిర్మిస్తున్నారు. ఇందులో ఒకటి స్మార్ట్ సిటీ పథకంలో సుమారు 91 కోట్ల రూపాయలతో కమాండ్ కంట్రోల్ రూమ్ (కొత్త మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం) నిర్మాణ దశలో ఉంది. మరొకటి రాయల్ చెరువు రోడ్డులో సుమారు రూ.300 కోట్లతో 12 అంతస్తుల తుడా టవర్స్ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇప్పటికే స్మార్ట్ సిటీ నిధులు సుమారు రూ.1000 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు నగరంలో చేపట్టారు. తిరుపతి రైల్వే స్టేషన్ సుమారు రూ.400 కోట్లతో ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం వైపు విస్తరణ జరుగుతుంది. రేణిగుంటలో రైల్వే క్యారేజీ రిపేర్ షాప్ కూడా మరింత విస్తరించేందుకు అవకాశాలున్నాయి. తిరుపతి జనాభా సుమారు నాలుగు లక్షల మంది ఉన్నారు. దేశానికే తలమానికంగా ఏడు యూనివర్శిటీలతో విద్యారంగంలో తిరుపతి ముందంజలో ఉంది.

గ్రేటర్ దిశగా తిరుపతి..

తిరుపతిని గ్రేటర్‌గా చేయడానికి, రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా పనులు చేయాలని సూచించడంతో తిరుపతి అభివృద్ధితోపాటు ఆదాయం పెంచుకునే మార్గంలో భాగంగా తిరుపతిని తూర్పు వైపు విస్తరించేందుకు ఎక్కువ అవకాశాలున్నాయి. తిరుపతి తో పాటు తిరుచానూరు, తుమ్మలగుంట, చంద్రగిరి, రేణిగుంట విమానాశ్రయం వరకు గ్రేటర్‌గా చేయాలని భావిస్తున్నారు. గ్రేటర్ తిరుపతి చేయాలంటే కనీసం జనాభా 15 నుంచి 20 లక్షలుండాలి. అధికారులు ఏ ప్రమాణాల మేరకు గ్రేటర్ చేయాలో ఇటు రాజకీయ నేతల, అటు మేధావుల సలహాలు, సూచనలు తీసుకొని నిర్ణయించే అవకాశం ఉంది. ప్రస్తుతం తిరుపతి జనాభా 2011 లెక్కల ప్రకారం మూడు లక్షలు ఉంది. యాత్రికులు రోజుకి లక్ష మంది రాకపోకలు సాగిస్తూ ఉంటారు. తిరుపతి గ్రేటర్ అయ్యేందుకు ఎంత మేరకు జనాభా పరిగణంలో తీసుకుంటారనేది, అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నారు. ప్రభుత్వం ఇచ్చిన సూచనల మేరకు గ్రేటర్ పనులు చేపట్టనున్నారు.

ఆదాయ వనరుల పెంపుకు అన్వేషణ..

తిరుపతి గ్రేటర్‌తో పాటు, ఆదాయ వనరులు ఎలా పెంపొందించుకోవాలనే దిశగా కూడా పనులు జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం తిరుపతి కార్పొరేషన్ ఆదాయం పెంచేలా గ్రేటర్ ఉండాలని కూడా రాష్ట్ర మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ సూచించారు. తిరుపతి వంటి నగరానికి ఆదాయ వనరులు కూడా ఎంతో అవసరం. దాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రేటర్ విస్తరణ చేపట్టాల్సి ఉంటుంది. ముఖ్యంగా తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఉండడం వల్ల ఆదాయ వనరులు లేవవుట్ల ద్వారా వచ్చే అవకాశం ఉంది. గ్రేటర్ తిరుపతి అవతరిస్తే నగర పరిధిలో అభివృద్ధికి ఆదాయ వనరులు సమకూరే అవకాశం ఉంది. ఎక్కువగా తిరుపతి తూర్పు, దక్షిణం వైపు కూడా కొన్ని గ్రామాలు గ్రేటర్‌లో కలిపే అవకాశం ఉంది. దీంతోపాటు చంద్రగిరి మండలంలో ఎంతవరకు గ్రేటర్లో కలుపుతారనేది ప్రభుత్వ నిర్ణయం మేరకు ఉంటుందని అధికారుల సమాచారం.

కౌన్సిల్ అనంతరం ప్రక్రియ వేగవంతం..

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ వచ్చే ఏడాది మార్చి 18 నాటికి పాలకవర్గం గడువు ముగుస్తుంది. కౌన్సిల్ పాలకవర్గం ముగిసిన తర్వాత గ్రేటర్‌లో ఏ గ్రామాలు కలపాలో, ఏఏ మండలాలు గ్రేటర్ పరిధిలోకి వస్తాయో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. ప్రజల అభిప్రాయాలు కూడా తెలుసుకునే అవకాశం ఉంటుంది. గ్రేటర్ తిరుపతి ప్రక్రియ పనులు సుమారు రెండు సంవత్సరాలపైగా సమయం పట్టే అవకాశం ఉంది. గ్రేటర్ తిరుపతికి 90కి పైగా డివిజన్లను రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించనునంది. తిరుపతి కార్పొరేషన్ కౌన్సిల్ ముగిసిన తర్వాత ప్రభుత్వ యంత్రాంగం గ్రేటర్ పై దృష్టి పట్టే అవకాశాలున్నాయి.

జిల్లా వాసులకు తెలుగు తేజం అవార్డులు

అవార్డు అందుకుంటున్న వరదయ్యపాలెంకు చెందిన పోలూరు జగన్నాథం

అవార్డు అందుకుంటున్న పుత్తూరుకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు దాసరి మునెయ్య

ప్రజాశక్తి-వరదయ్యపాలెం, పుత్తూరు టౌన్: అంతర్జాతీయ సాహితీ సంస్థ శ్రీ కళా వేదిక తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఆదివారం పలనాడు జిల్లా కేంద్రం, నరసరావుపేట, భువనచంద్ర టౌన్ హాల్‌లో వరదయ్యపాలెంకు చెందిన ఉపాధ్యాయుడు, కవి, జానపద కళాకారుడు పోలూరు జగన్నాథంకు, పుత్తూరుకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు దాసరి మునెయ్యకు ప్రముఖుల చేతుల మీదుగా తెలుగు తేజం అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, జాతీయ చైర్మన్ ఈశ్వరి భూషణం, నరసరావుపేట శాసనసభ్యులు చదలవాడ అరవింద్ బాబు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోటేశ్వరరావు, జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య మనవడు నరసింహారావు, గుర్రం జాషువా మనవరాలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ శ్రీ మహాప్రస్థానంపై చర్చాగోష్టి

చర్చాగోష్ఠిలో పాల్గొన్న వక్తలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఆధునిక తెలుగు సాహిత్యంలో ఈ శతాబ్దం నాది అన్న శ్రీరంగం శ్రీనివాసరావు మహాప్రస్థానం పుస్తకం రాసి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, ప్రజానాట్య మండలి సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి, బైరాగిపట్టెడ, గంధమనేని శివయ్య భవనం, గ్రంథాలయంలో అధ్యక్ష, కార్యదర్శులు యువశ్రీ మురళి, నెమిలేటి కిట్టన్నల ఆధ్వర్యంలో మహాప్రస్థానంపై చర్చాగోష్టి నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా అరసం రాష్ట్ర నాయకులు సాకం నాగరాజ హాజరై నేటి సమాజ స్థితిగతులను గురించి శ్రీశ్రీ ఆనాడే అక్షరరూపం ఇచ్చారని, చైతన్యవంతమైన సమాజాన్ని చూడాలని రచనలు చేశారని తెలిపారు. తిరుపతి జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి మన్నవ గంగాధర ప్రసాద్, ఈతరం కవితా వేదిక అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆధునిక సమాజంలో శ్రీ శ్రీ గీతాలు ఎందరినో ప్రభావితం చేశాయన్నారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ శ్రమైక జీవన సౌందర్యాన్ని శ్రీ శ్రీ రచనల్లో రాశారన్నారు. ఈ కార్యక్రమంలో వేమన విజ్ఞాన వేదిక అధ్యక్షులు మల్లారపు నాగార్జున, పేరూరు బాలసుబ్రమణ్యం, నడ్డి నారాయణ, విశ్వనాథ్ రెడ్డి, గాయకులు కడివేటి మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వినాయక నిమజ్జనం

● తిరుపతి వినాయక్ సాగర్‌లో..

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: వినాయక నిమజ్జన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. నగరపాలక సంస్థలో ఏర్పాటు చేసిన వినాయకుడికి మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ ఎన్.మౌర్య ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం వినాయక సాగర్ వరకు ర్యాలీగా చేరుకుని నిమజ్జనం చేశారు. ఊరేగింపులో నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య, ఎస్పీ హర్షవర్ధన్ రాజులు మాట్లాడుతూ నిమజ్జనానికి వినాయక సాగర్‌లో ఏర్పాట్లు పకడ్బందీగా చేశామన్నారు.

3.55 లక్షల రూపాయలు పలికిన లడ్డు..

వినాయక చవితి వేడుకల్లో ఏర్పాటు చేసిన లడ్డు వేలంలో రూ.3.55 లక్షల రూపాయలు పలికింది. నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన లడ్డును ప్రతి ఏడాది వేలం పాట నిర్వహిస్తారు. ఈ ఏడాది నిర్వహించిన వేలం పాట పోటాపోటీగా జరిగింది. ఇందులో ఇంజినీరింగ్ అధికారులు 3.55 లక్షల రూపాయలకు పాడి దక్కించుకున్నారు. వేలం పాటలో దక్కించుకున్న లడ్డు ను నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ ఎన్.మౌర్యలు సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్‌కు లడ్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్లు సేతుమాధవ్, రవి, ఏసిపి మూర్తి, మధు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రామచంద్రపురం: వినాయక చవితి వేడుకలు ముగింపులో భాగంగా, వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం రాయలచెరువు, బాదురు చెరువు, అనుపల్లి చెరువులలో వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం కోలాహలంగా జరిగింది. వినాయక చవితి వేడుకలు ప్రారంభమై ఐదు రోజులు అవుతున్న సందర్భంగా గణపయ్య విగ్రహాలను మండపాల నుండి వాహనాలలో తీసుకుని డబ్బులు కేరింతల కొడుతూ యువత, గ్రామల ప్రజలు ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువుల వద్ద విగ్రహాలకు ధూప దీప నైవేద్యాలు సమర్పించి నీటిలో నిమజ్జనం చేశారు. అనుపల్లెలో యువత ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహించారు. వినాయక నిమజ్జన కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్సై మురళీమోహన్, పోలీస్ సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉపాధి హామీలో మోసాలకు చెక్

- నూతనంగా ఫేస్ రికగ్నిషన్ యాప్ అమలు
- ప్రజాశక్తితో డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్

ముఖా ముఖి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా పరిధిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పని దినాల కల్పనతో పాటుగా అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళిక బద్ధంగా ముందుకెళుతున్నామని, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రత్యేక సూచనలతో తిరుపతి జిల్లాల్లో రైతాంగానికి మేలు చేకూర్చేలా కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. తిరుపతి జిల్లా పరిధిలో కూలీలకు పని దినాల కల్పన, పల్లె పండుగ అభివృద్ధి కార్యక్రమాలు, కేంద్రం నుండి రావలసిన బకాయిలు వంటి విషయాలపై ప్రజాశక్తి ముఖాముఖిలో పిడి వివరించారు.

ప్రజాశక్తి: ఉపాధి హామీ పథకంలో ఎటువంటి తప్పిదాలకు తావు లేకుండా తీసుకుంటున్న చర్యలను వివరించండి?

పిడి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా క్షేత్రస్థాయిలో ఎటువంటి అవినీతి జరగకుండా నూతనంగా ఫేస్ రికగ్నిషన్ యాప్‌ను తీసుకువచ్చి ఎన్ఐసి 2.0 లో భాగంగా ప్రతి పనిని ముందు, ప్రస్తుతం, తరువాత లాగా క్షేత్రస్థాయిలో జరిగిన పనులకు సంబంధించి ఫోటోలను అప్లోడ్ చేయడం జరుగుతోంది. ఇందుకు సంబంధించి సిబ్బందికి శిక్షణ పూర్తి చేసి వచ్చే వారం నుండి అమలుకు శ్రీకారం చుట్టాము.

ప్రజాశక్తి: పల్లె పండుగ కార్యక్రమానికి సంబంధించి బకాయిలు చెల్లించడం జరిగిందా?

పిడి: తిరుపతి జిల్లా పరిధిలో పల్లె పండుగ ద్వారా జరిగిన కార్యక్రమాలకు దాదాపుగా అన్నింటికీ బిల్లులు చెల్లించడం జరిగింది. రూ.62 కోట్ల బకాయిలు ఉంటే అందులో రూ.30 కోట్లు ఇప్పటికే లబ్ధిదారులకు చేరేందని, టెక్నికల్ కారణాల ద్వారా ఆగిన మరో రూ.32 కోట్ల రూపాయలు త్వరలో కేంద్రం నుండి విడుదల కానున్నాయి. పెండింగ్లో ఉన్న రూ. 34 కోట్ల రూపాయలకు సంబంధించిన బిల్లులు అప్లోడ్ చేయడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన స్పర్స్ విధానం ద్వారా ఈ పేమెంట్ విధానం జరుగుతోంది.

ప్రజాశక్తి: గత వైసిపి ప్రభుత్వ హాయంలో ఉపాధి హామీ నిధులను దారి మళ్ళించారని విమర్శలు ఉన్నాయి?

పిడి: గత ప్రభుత్వ హాయంలో విత్ హెల్డ్ పేమెంట్స్ ఉండేవి. రాష్ట్రవ్యాప్తంగా 34 కోట్లు ఉండగా తిరుపతి జిల్లాకు సంబంధించి రెండు కోట్ల విత్ హెల్డ్ పేమెంట్స్ ఉన్నాయి. అవి ప్రస్తుతం చెల్లించబడ్డాయి.



ప్రజాశక్తి: తిరుపతి జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు పేమెంట్లు సకాలంలో జరగడం లేదు. దానికి గల కారణాలు తెలపండి?

పిడి: తిరుపతి జిల్లా పరిధిలో 12 వారాలకు సంబంధించిన పని దినాల బకాయిలు ఉన్నాయి. బకాయి ఉన్న మొత్తాన్ని కూడా వారం.. వారం పని దినాల సంఖ్యను బట్టి అప్లోడ్ చేయడం జరుగుతుంది. అయితే కేంద్ర ప్రభుత్వం నుండి నేరుగా ఉపాధి హామీ కూలీలకు వారి ఖాతాలోని జమ చేసే విధంగా నిర్ణయం తీసుకున్నారు. జిల్లా కేంద్రం నుండి వారి పని దినాలు, సమయాలు, హాజరును మాత్రమే నమోదు చేయడం జరుగుతోంది. త్వరలో ఉపాధి హామీ కూలీలకు బకాయి ఉన్న రూ. 25 కోట్ల రూపాయలు వారి ఖాతాలకు బదిలీ కాబడతాయి.

ప్రజాశక్తి: ప్రారంభమైన ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ఉపాధి హామీ నిధుల ద్వారా చేపట్టిన కార్యక్రమాలను వివరించండి?

పిడి: తిరుపతి జిల్లా పరిధిలో 2025-26 సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ నుండి నేటికీ 53 లక్షల పని దినాలను కల్పించాం. ఇందుకుగాను కూలీలకు రూ.150 కోట్ల రూపాయలు చెల్లించడం జరిగింది. ఉపాధి హామీ నిధులతో రైతులకు మేలు చేకూర్చేలా ప్రత్యేక ప్రణాళికగా హార్టికల్చర్ విభాగం సహకారంతో 1000 ఎకరాల్లో పండ్ల తోటలను నాటడం జరిగింది. 2100 ఫారం పాండ్స్ ఇచ్చాము. గత ఆర్థిక సంవత్సరానికి 1500 మినీ గోకులాలు ఇస్తే, ఈ ఆర్థిక సంవత్సరంలో 1000 గోకులాలు నిర్మాణానికి ఉపాధి హామీ నిధులను కేటాయించాం.

వైయస్ఆర్ విగ్రహాల ముస్తాబు

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: చిన్న గొట్టిగల్లు మండల కేంద్రంలో దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని మంగళవారం నిర్వహించేందుకు, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సూచనల మేరకు వైయస్సార్ విగ్రహాలకు రంగులు వేయిస్తున్నట్లు మండల పార్టీ కన్వీనర్ సింహాల మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మున్సిపాలిటీ పరిధి, గేట్ పుత్తూరు 7వ వార్డులో టీడీపీ గేట్ పుత్తూరు క్లస్టర్ ఇంచార్జి డిఎస్ గణేష్, జనరల్ సెక్రటరీ ఎన్ఎన్ ధనపాల్‌ల ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికీ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ దుర్గ, వార్డ్ సీనియర్ నాయకులు ఎంవి అంబళగన్, తెలుగు మహిళా మోహన, అశోక్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన వేడుకల్లో సిఐ నాగార్జున రెడ్డి



ప్రజాశక్తి -శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి రూరల్ మండలం, చుక్కల నిడిగల్లు, ఎస్సీ కాలనీలో ఆదివారం నిర్వహించిన వినాయక విగ్రహ నిమజ్జన కార్యక్రమంలో టూ టౌన్ సి నాగార్జున రెడ్డి పాల్గొన్నారు. నిమజ్జన సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను యువతకు విశదీకరించి చెప్పారు. శాంతియుత వాతావరణంలో నిమజ్జనాన్ని పూర్తి చేయాలని సూచించారు. పవన్ కుమార్, ఖుషీ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో పోటీ పరీక్షల మెటీరియల్స్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: విద్యార్థులు పోటీ పరీక్షల్లో నెగ్గేందుకు అవసరమైన మెటీరియల్స్‌ను అన్ని గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచుతున్నట్లు రాష్ట్ర పౌర గ్రంథాలయాల శాఖ డైరెక్టర్ కృష్ణమోహన్ తెలిపారు. పట్టణంలోని స్థానిక గ్రేడ్-1 గ్రంథాలయాన్ని కృష్ణమోహన్ ఆదివారం పరిశీలించారు. పాఠకులతో నేరుగా ముచ్చటించి గ్రంథాలయాల సేవలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. తదనంతరం విద్యార్థులకు క్విజ్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాల సంస్థ జిల్లా కార్యదర్శి శర్మ, గ్రంథాలయ అధికారి లావణ్య పాల్గొన్నారు.

వైభవంగా కలిశాభిషేకం

ప్రజాశక్తి-ఐరాల: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి మాడవీధుల్లో బంగారు చిన్న శేషవాహనంపై విహరించారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు కలశాలను తీసుకెళ్ళి ఊరేగింపులో పాల్గొన్నారు. తరువాత ఆలయంలో కళ్యాణ వేదిక వద్ద. నిర్వహించిన క్షీర కలశాభిషేకంలో పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ పాల్గొన్నారు. ఆలయ ఈవో పెంచల కిషోర్ గారి సమక్షంలో పండితులు కలశాలను స్వీకరించి కళ్యాణ వేదిక వద్ద సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి వారికి శాస్త్రోక్తం గా తేనే, నెయ్యి, పాలు, పెరుగు, సుగంధ ద్రవ్య పరిమళాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాణిపాకం దేవస్థానం ఈవో పెంచల కిషోర్, పూతలపట్టు నియోజకవర్గం ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ఆలయ అధికారులు, ఉభయ దారులు, పాల్గొన్నారు.

యువకుల మధ్య రగడ

- కత్తితో దాడి, ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు

దాడిలో మృతి చెందిన చందు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతిలో యువకుల మధ్య చోటు చేసుకున్న రగడ, ఓ వ్యక్తి ప్రాణాలను బలితీసుకుంది. వినాయక నిమజ్జనం ముందు రోజు శనివారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన నగరంలో కలకలం రేపింది. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి, కొర్లగుంటలో నివాసముంటున్న ఆటో డ్రైవర్ అశోక్, సాఫ్ట్వేర్ ఉద్యోగి హేమంత్‌కు గత కొంతకాలంగా పాత కక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆటో డ్రైవర్ అశోక్‌పై హేమంత్ తన స్నేహితులు సుధాకర్, చందులతో కలిసి శనివారం రాత్రి హత్య చేసేందుకు పథకం వేశాడు. కొర్లగుంట రోడ్డులో వినాయక చవితి ఉత్సవాల్లో పాల్గొని రోడ్డుపై ఒంటరిగా ఉన్న అశోక్‌పై హేమంత్ అతని స్నేహితులు కత్తితో దాడి చేశారు. అప్రమత్తమైన అశోక్, తనపై దాడికి పాల్పడిన వారు వద్ద నుంచి కత్తిని లాక్కొని వారిపై దాడికి దిగాడు. తీవ్ర కత్తిపోట్లకు గురైన చందు (25) అక్కడికక్కడే మృతి చెందాడు. హేమంత్, సుధాకర్‌కు గాయాలయ్యాయి. అశోక్ అక్కడి నుంచి పారిపోయాడు. స్థానికులు గాయాలపాలైన వారిని తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అశోక్, హేమంత్‌లకు మధ్య ఉన్న గొడవకి అసలు కారణం పోలీసుల విచారణలో తెలాల్సి ఉంది.

ఉద్యోగ విరమణ చేసిన వారి సేవలు అమూల్యం

- సన్మాన సభలో ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్) పరిధిలో వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తూ పదవీ విరమణ పొందుతున్న చీఫ్ జనరల్ మేనేజర్లు డిఎస్ వరకుమార్, కెఆర్ఎస్ ధర్మజ్ఞాని, జనరల్ మేనేజర్ పి.మురళిల సేవలు ఎనలేనివని ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోష రావు పేర్కొన్నారు. ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎండి కె. సంతోష రావు మాట్లాడుతూ ఏపీఎస్పీడీసీఎల్‌లో వివిధ హోదాల్లో వారు వినియోగదారులకు అందించిన సేవలను కొనియాడారు. సత్యవేడు నియోజకవర్గ శాసనసభ్యులు కె.ఆదిమూలం, ఏపీఎస్పీడీసీఎల్ మాజీ సీఎండి కలాల రంగనాథం, డైరెక్టర్లు కే.గురవయ్య, పి.అయూబ్ ఖాన్ తదితరులు మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తూ సంస్థ అభివృద్ధికి వారు తమ వంతు సహకారాన్ని అందించారని కొనియాడారు. అనంతరం పదవీ విరమణ పొందిన అధికారులు మాట్లాడుతూ ఏపీఎస్పీడీసీఎల్‌లో వివిధ హోదాల్లో విధుల నిర్వహణలో తమకు సహకరించిన అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారిని సంస్థ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణా దేవి, పిహెచ్ జానకిరామ్, కె. రామ్మోహన్ రావు, మాజీ సీజిఎం ఫైనాన్స్ వై. లక్ష్మీ నరసయ్య, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కె. జనార్ధన్ నాయుడు, ఏఎస్పి రవి మనోహరాచారి, జనరల్ మేనేజర్లు ఎం. కృష్ణా రెడ్డి, శ్రీనివాస రావు, రామచంద్ర రావు, రమేష్, సురేంద్ర రావు, మురళీ కుమార్, ప్రసాద్, వెంకటరాజు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు రమణ, విజయన్, సురేంద్ర నాయుడు, ఇస్మాయిల్ అహ్మద్, శేషాద్రి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను సీఎం చేసేందుకు కృషి చేద్దాం : భూమన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : మళ్లీ జగనన్నని ముఖ్యమంత్రి చేసుకోవడం కోసం కృషి చేయాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసీపీ అధ్యక్షులు భూమన కరుణాకర రెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతిలో ఆదివారం జరిగిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, నగర కమిటీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నాయకులు, కార్యకర్తలు ప్రజాసేవలో మరింత చురుగ్గా పాల్గొంటూ నిత్యం ప్రజల్లో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్ రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, నగర అధ్యక్షులు మల్లం రవిచంద్ర రెడ్డి, టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్ర రెడ్డి, నగర మహిళా అధ్యక్షురాలు గంగవరం కోటేశ్వరమ్మ, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య శ్రేయస్సుకు నడకే ప్రధానం

గోవిందరాజు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ లక్ష్మీప్రతిమకు సత్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : స్థానిక గోవిందరాజ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ మామిళ్ళ లక్ష్మీ ప్రతిమ, చైర్మెన్ డాక్టర్ పి.సి.రాయులు, ప్రెసిడెంట్ కె. రఘురాం రెడ్డి, జనరల్ సెక్రెటరీ తోట చక్రపాణి హాజరయ్యారు. చైర్మన్ డాక్టర్ పి.సి. రాయులు, ప్రెసిడెంట్ రఘురాం రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజు నడక, వ్యాయామము చేయవలన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ మామిళ్ళ లక్ష్మీ ప్రతిమ మాట్లాడుతూ చెవి, ముక్కు, గొంతు సమస్యలను మొదట్లోనే తెలుసుకొని సులభమైన మార్గంలో వైద్యం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విఎస్ఆర్ ఆంజనేయులు, రెడ్డివారి ప్రభాకర్ రెడ్డి, భారతి, బంగారు బాబు, మాజీ డీఈవో నాగరాజు, మాయాబజార్ భాస్కర్ రెడ్డి, ఉదయగిరి కృష్ణమూర్తి, గోపి, ఆర్ముగం, విజయ భాస్కర్ రెడ్డి, షాబుద్దీన్, చంద్రశేఖర్, మధుసూదన్ రెడ్డి, గంగాధర్ రెడ్డి, కృష్ణారెడ్డి, కార్యవర్గ సభ్యులు, వాకర్సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల హక్కులను హరించొద్దు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీలో ఇకపై విద్యార్థి సంఘాలు సెమినార్లు, డిబేట్లు, జెండాలు, నినాదాలు, ధర్నాలు వంటి కార్యక్రమాలు చేపట్టకుండా తీసుకొచ్చిన ఆర్డర్‌ను వెనక్కి తీసుకోవాలని మేము డిమాండ్ చేస్తున్నాము. లేకపోతే, భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) వివిధ విద్యార్థి సంఘాలను కలుపుకొని దశలవారీగా ఉద్యమాలకు పిలుపునిస్తుందని స్పష్టం చేస్తున్నామన్నారు. అధికారులు తెలుగుదేశం పార్టీ కార్యకర్తల్లా వ్యవహరించకూడదని మేము హెచ్చరిస్తున్నాము. వైస్ ఛాన్సెలర్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు ప్రభుత్వ ఉద్యోగులమని మరిచి రాజకీయనాయకులైన నారా లోకేష్, పవన్కళ్యాణ్, చంద్రబాబు నాయుడు, చిరంజీవి జన్మదిన వేడుకలకు వెళ్ళి, కేకులు కోసి సంబరాలు చేసారు. కానీ విద్యార్థి సంఘాలు వివిధ సామాజిక అంశాల మీద సెమినార్లు నిర్వహించుకోకుండా అధికారాలు అడ్డంపెట్టుకొని ఇలాంటి ఉత్తర్వులు ఇస్తున్నారు. మీరు తీసుకునే జీతాలు మా తల్లిదండ్రులు కష్టపడి చెల్లించే పన్నుల నుంచే వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాలు రాజకీయాల్లోకి రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేయవద్దు. అగ్రకుల ఆధిపత్య భావజాలాన్ని అంతమొందించే వరకు విద్యార్థి సంఘాలు పోరాటం కొనసాగిస్తాయి. ఇదే యూనివర్సిటీలో ఎన్నో సమస్యలపై విద్యార్థులు పోరాడి విజయాలు సాధించారు. రెండు సంవత్సరాల క్రితం యూనివర్సిటీ మాస్టర్ ప్లాన్ కింద రోడ్లు వేయకుండా విద్యార్థి సంఘాలు అడ్డుకున్నాయి. ఆ రోజున అధికారులు ఏసీ గదుల్లో కూర్చొని వేడుక చూసారు. ఆ ఉద్యమ స్ఫూర్తితోనే, ఈ ఆర్డర్‌ను వెనక్కి తీసుకునే వరకు మేము పోరాటం కొనసాగిస్తామని ప్రకటిస్తున్నామన్నారు.

శ్రీవారికి రూ. 4 కోట్లా 13 లక్షలు విరాళం

ప్రజాశక్తి -తిరుమల: తిరుమల శ్రీవారికి ఆదివారం భక్తులు విలువైన కానుకలు సమర్పిస్తున్నారు. తాజాగా టిటిడి భారీ విరాళం అందింది. ఆర్ఎస్‌బి రీటైల్ ఇండియా లిమిటెడ్ టీటీడీ బర్డ్ ట్రస్ట్‌కు సుమారు రూ. 2.93 కోట్లు విరాళం ఇచ్చింది. ఆర్ఎస్ బ్రదర్స్ జ్యువెలరీస్ ప్రైవేట్ లిమిటెడ్ బర్డ్ ట్రస్ట్‌కు రూ.1.10 కోట్లు విరాళం ఇచ్చింది. ఈ విరాళాలకు సంబంధించిన డిమాండ్ డ్రాఫ్ట్‌లను ఆయా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్లు పొట్టి వెంకటేశ్వర్లు, సీర్న రాజమౌళి, టి.ప్రసాదరావు, పొట్టి మాలతి లక్ష్మీకుమారిలు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈఓ వెంకయ్య చౌదరిలకు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో అందజేశారు.

అన్నప్రసాదం ట్రస్ట్‌కు 10లక్షలు విరాళం..

ఈ విరాళాలతో పాటు నరసరావుపేటకు చెందిన భక్తుడు రామాంజనేయులు శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10లక్షలు విరాళంగా సమర్పించారు. ఈ భారీ విరాళాలు టీటీడీ చేపడుతున్న సామాజిక, ధార్మిక కార్యక్రమాలకు, ముఖ్యంగా బర్డ్ ట్రస్ట్ ద్వారా పేదలకు అందించే వైద్య సేవలకు మరింత తోడ్పడనున్నాయి. గతంలో కూడా ఆర్ఎస్ బ్రదర్స్ సంస్థ టీటీడీ ట్రస్టులకు పలుమార్లు భారీ విరాళాలు అందజేసింది. ఇది శ్రీవారి భక్తుల ఆధ్యాత్మిక నిబద్ధత, సేవా భావాన్ని మరోసారి చాటి చెప్పింది.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

- ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ

ప్రజాశక్తి - నాయుడుపేట: వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్న కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. నాయుడుపేట సహకార సంఘం అధ్యక్షులుగా ప్రభాకర్ నాయుడు నియమితులైన సందర్భంగా ఆదివారం సాయంత్రం నాయుడుపేట పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, పార్థసారథి దంపతుల తోపాటు మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడుపేట నూతన సహకార సంఘం అధ్యక్షులుగా నియమితులైన జి.ప్రభాకర్ నాయుడు, టిడిపి నేత కట్టా వెంకటరమణారెడ్డిలతోపాటు పలువురు సహకార సంఘాల డైరెక్టర్లు, తెలుగుదేశం పార్టీ నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పార్థసారథి దంపతుల తోపాటు మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంలకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా నియమితులైన సహకార సంఘ అధ్యక్షులు, డైరెక్టర్లు, రైతులకు అందుబాటులో ఉండి వారి అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేలా సహకార సంఘాలు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, పెళ్లకూరు మండల టిడిపి అధ్యక్షులు సంచి కృష్ణయ్య, చిల్లకూరు సొసైటీ డైరెక్టర్ గోపాలకృష్ణ, తెలుగుదేశం పార్టీ నాయకులు పోట్లపూడి రాజేష్, ఖాదర్ భాష, ఆబోతుల బాబు పలువురు నాయకులు పాల్గొన్నారు.

గొడుగులు, పాదరక్షలు పంపిణీ

ప్రజాశక్తి -కోట : కోట మండల కేంద్రం, శ్రీ కోటమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో 16 మందికి గొడుగులు, పాదరక్షలు అందజేశారు. వాకాడు మండలం, బాలిరెడ్డిపాలెంలోని శ్రీ పట్టాభిరామాలయం కేంద్రంగా నడుస్తున్న శ్రీ సీతారామధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులు ఆవుల సుబ్బయ్య, కోటమ్మ దంపతుల ఆర్థిక సహాయంతో పదివేల రూపాయల విలువచేసే గొడుగులు, పాదరక్షలను శ్రీ షిరిడి సాయి అక్షయ సేవా సమితి సంస్థ అధ్యక్షులు అల్లం రమణయ్య, ప్రగతి విద్యాసంస్థల అధినేత పసుపులేటి కిషోర్ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన వారికి ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో పెళ్లూరు కోటేశ్వర రెడ్డి, వెంపులూరు బాబూరావు, పన్నగ సాయి, సంస్థ ప్రతినిధులు దీవి అనంతబాబు, హేమంత్ శర్మ, నరేష్ శర్మ, సాయిబాబు, నందకుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎం జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరం



ప్రజాశక్తి-సూళ్లూరుపేట: సూళ్లూరుపేటలో డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ముందస్తు జన్మదిన వేడుకల్లో భాగంగా ఆర్ అండ్ బి బంగ్లాలో రాయలసీమ జోనల్ కమిటీ మెంబర్ మాబాష, జనసేన పార్టీ మండల అధ్యక్షులు రమణల ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుతోట రమేష్, శివాలయ గుడి చైర్మన్ ఆదినారాయణ రెడ్డి, మాధవ నాయుడుల చేతుల మీదుగా ప్రారంభించారు. చిరంజీవి, పవన్ కళ్యాణ్ అభిమానులు ఈ రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు హరిబాబు,కోటి,దాసు,తేజ, రాము,వీర మహిళలు పద్మజ, సుజాత పాల్గొన్నారు.

కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులుగా జనార్ధన్ రెడ్డి



జనార్ధన్ రెడ్డిని సన్మానిస్తున్న బత్తెయ్య నాయుడు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులుగా శ్రీకాళహస్తి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జనార్ధన్ రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా జనార్ధన్ రెడ్డిని పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తెయ్య నాయుడు స్థానిక పీపుల్స్ నర్సింగ్ హోమ్‌లో ఆదివారం ఘనంగా సత్కరించారు. రైతుల పక్షాన అలుపెరుగని పోరాటం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వడివేలు, కూలి రవికుమార్, ఈర్ల గోపి, శెట్టిపల్లి శివ, ఎస్.నాగూర్, వీర రాఘవరెడ్డి, సురేష్, రమణయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ ఆదిభట్ల నారాయణదాసుకు పుష్పాంజలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: హరికథా పితామహునిగా పేరున్న అజ్జాడ ఆదిభట్ల నారాయణదాస 160వ జయంతిని పురస్కరించుకుని తిరుపతిలోని టిటిడి శ్రీ వేంకటేశ్వర సంగీత, నృత్య కళాశాల ప్రాంగణంలో ఆయన విగ్రహానికి ఆదివారం ఉదయం కళాశాల ప్రిన్సిపాల్ డా.ఉమా.ముద్దుబాల, డిపిపి సెక్రటరీ శ్రీ శ్రీరామ్ రఘునాథ్ లు ఘనంగా పుష్పాంజలి సమర్పించారు. అనంతరం కళాశాల విద్యార్థులు బృందగానం నిర్వహించారు. శ్రీ ఎస్వీ మ్యూజిక్ కళాశాల నుండి ఊరేగింపుగా మహతి ఆడిటోరియం చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు డిపిపి కళాకారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి టీచర్స్ లీగ్ నిర్వహణ అభినందనీయం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం పురస్కరించుకుని, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి టీచర్స్ క్రికెట్ లీగ్ పోటీలు అల్లూరు ఆదిశేషా రెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి 20 మండలాల కెప్టెన్‌లు, క్రీడాకారులు హాజరయ్యారు. మొదటి మ్యాచ్‌ని గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ సునీల్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీచర్లలో ఉన్న క్రీడా ప్రతిభని ప్రోత్సహించడానికి రాష్ట్ర స్థాయి టీచర్స్ క్రికెట్ లీగ్ నిర్వహించడం ఆనందదాయకమన్నారు. అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ టీచర్లకు ఆటవిడుపుగా ఈ టీచర్స్ క్రికెట్ లీగ్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ కోఆర్డినేటర్ పిడి కరిముల్లా, టిడిపి నాయకులు పట్టాభి రెడ్డి, కరుణాకర్ రెడ్డి, మస్తాన్ నాయుడు ప్రగతి సేవా సంస్థ ఉపాధ్యక్షుడు బండి ధనుంజయ రెడ్డి, ట్రెజరర్ కాటూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

హత్య కేసును ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: తిరుపతిజిల్లా, వెంకటగిరి రైల్వేస్టేషన్ సమీపంలో మూడు రోజుల క్రితం జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. వెంకటగిరి సిఐ వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు, వెంకటగిరి రూరల్ మండలం, అమ్మపాలెం గ్రామానికి చెందిన అటుపాక శివయ్య (25)ను చేతబడి చేశాడనే అనుమానంతో, అదే గ్రామానికి చెందిన జానకిరామ్, సాయికుమార్‌లు మద్యం తాగించి హత్య చేశారని తెలిపారు. జానకిరామ్ తన తండ్రికి శివయ్య చేతబడి చేయించాడని, అలాగే సాయికుమార్ అక్క, తండ్రి చావుకు కూడా శివయ్యే కారణమని, అందుకే అతన్ని చంపేశామని పోలీసుల విచారణలో నిందితులు వెల్లడించారు. నిందితులను ఆదివారం వెంకటగిరి, క్రాస్ రోడ్డు సమీపంలో అరెస్ట్ చేశామని, కేసునమోదు చేసి, కోర్టుకు హాజరుపరుస్తామని సిఐ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా, పది మందికి గాయాలు

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండలం, కాశీపురం గ్రామస్తులు వినాయక నిమజ్జనానికి తూపిలిపాలెం గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యంలో వస్తున్న ట్రాక్టరు అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సుమారు పదిమంది గాయాల పాలయ్యారు. గాయపడిన వారిని ప్రజలు వాకాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారిలో ఇద్దరు పరిస్థితి విషమంగా ఉన్నందున మెరుగైన చికిత్స కోసం గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తిరుమలలో ఘనంగా ఉట్లోత్సవం

- రూ.1.73 లక్షలు పలికిన గణేష్ లడ్డూ

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల, ఈస్ట్ బాలాజీ నగర్‌లో వినాయక నిమజ్జనం సందర్భంగా ఉట్లోత్సవం వైభవంగా నిర్వహించారు. స్థానికులు పాల్గొని ఉట్లోత్సవాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలం పాటలో రూ.1.73 లక్షలకు తిరుమలకు చెందిన మోహన్ గణేష్ లడ్డూను దక్కించుకున్నారు.

ఘనంగా గణపయ్య నిమజ్జనం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మండల పరిధిలోని పలు గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండపాలలో ఏర్పాటుచేసిన వినాయక స్వామి విగ్రహాలకు ఆదివారం సాయంత్రం నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు. యువకులు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.

ఎస్‌పిడబ్ల్యూ కళాశాలలో..

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో వినాయక ఉత్సవాల్లో భాగంగా ఐదవరోజు నిమజ్జనం కోలాహలంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపల్ డా. సి. భువనేశ్వరి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హాస్టల్ విద్యార్థినిలంతా సాంప్రదాయ ఆటపాటలతో, కేరింతలతో నిమజ్జన కార్యక్రమంలో ఉత్సాహంగా, ఉల్లాసభరితంగా గణనాథున్ని గంగ ఒడికి చేర్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తిరుపతి డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ సి.వి.శ్రీనివాస ప్రసాద్‌కి నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్స్ డా.స్నేహలత, యామిని సుధ, డా.ధనమ్మ, అధ్యాపకులు, హాస్టల్ సిబ్బంది నవీన్,చెంచురెడ్డి,శ్రీప్రియ మరియు మాట్రిన్స్ రాధ, లత, పుష్ప, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE V ADDITIONAL DISTRICT JUDGE OF TIRUPATI
I.A.No. 68 of 2025
O. S. No. 35 of 2021
BETWEEN:
J.B.Pattabhi and another
...Petitioners/Plaintiffs
AND:
Kambhampati Udayabhaskara
Rathnamamba and others
... Respondents / Defendants
NOTICE TO RESPONDENTS NO.2
in the above petition in I.A.No. 68 of 2025
R-2 Aathreyapurapu Srinivasa Rao S/o Aathreyapurapu Kamalakar Rao, Door No.1034, Sivajyothi Nagar, Tirupati Urban, Tirupati District.
Please take notice that in the above petition, suit filed by the Petitioners / Plaintiffs against you is posted to 08-09-2025 for notice and for your appearance before the above court. If you got any objections, attend the above court on the above date at 10-30 a.m. and file the same. Failing which the matter will be decided exparte. HEARING DATE: 08-09-2025
S. ADINARAYANA
ADVOCATE: TIRUPATI, **Ph.No. 9440631284**